# అవధానం

1938 ఆగస్టు అనుకుంటాను. ఆనాటి సాయంకాలం హైస్కూల్లో అష్టావధానం అన్నారు.

సెంట్రల్ హాల్లో బల్లలు తీసేసి బరఖోలు సర్దారు. గోడ వార పెద్ద ప్లాట్ ఫారం— దానిమీద పసందైన తివాచీ ఆవధానిగారు అసనపుద్ధిగా కూర్చోడానికి వెనకా పక్కలా మెత్తని దిండ్లు అమర్చారు.

స్కూలుసిబ్బందీ విద్యార్థులూ కాక ఊళ్లో సాహిత్యప్రియులూ, అలా చలామణీ అయేవారూ, హాలంతా నిండి కూర్చున్నారు.

అష్టావధాని ఒక తెలుగు పండితుడు.

అప్పటికే ఊళ్లో కొంత పలుకుబడి సంపాదించి ఒక వర్గానికి ఆత్మీ

యుడై కవి దర్జాతో తిరుగుతూ కొంతమందిని వెంట తిప్పుకుంటూన్న వాడు. పండితుడంటే ఒక వేషం; తెలుగు పండితుడంటే మరో వేషం; తెలుగు పండితుడు కవిగా అవతరిస్తే ఇంకో వేషం విధిగా ఉంటుంది.

ఆరోజుల్లో "పండితుడు" అని నిరుపపదంగా అంటే—ఒకమూర్తి సాక్షాత్కరించేది.

జరీపనిచేసిన ఒక ఎర్రకాశ్మీరు శాలువా భద్రంగా మడతపెట్టి ఒక బుజంమీద వేసుకుని రెండో బుజంమీద ముక్కు తుడుచుకోడానికి ఉంచుకున్న చిన్న అంగవస్త్రం. నీరుకావి ధోవతి, రొండిని వెండి బిరడాతో బొబ్బిలిపొడుంకాయ, ముఖాన కుంకుమ. విభూతులూ, సాధారణంగా 20, 30 రోజులు వయస్సు తక్కువ లేకుండా మాసిన గెడ్డం—ఇదీ ఆకృతి.

తర్క వ్యాకరణ శాస్త్రాల్లో ఏదో ఒకదానిలో నిధి కావాలి; అయితేనే పండిత బిరుదం—లేకపోతే వట్టి తెలుగుపండితుడే.

అంతవరకూ అంత ఉన్నతంగా ఉన్న పండిత పదవికి 'తెలుగు' అని మూడక్షరాలు తగిలేసరికి కుంకుడుకాయ పులుసుకు నూనె విరిగిపోయి నట్లు ఆ పండితశబ్దం ఇట్టే విరిగిపోయి ఊరుకుంటుంది.

చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రులుగారు ఎప్పుడూ హైస్కూలు తెలుగు పండితుల్ని 35—మార్కులవాళ్ళు, అని సంభావించేవారు; అయితే తమరూ ఒకప్పుడు హైస్కూలు పండితపదవిని అలంకరించిన వారలే అని ఆయన కప్పుడు తోచేదికాదు కాబోలు. అయితే ఒక్క తమాషావుంది. హైస్కూలు కోసం పండితు డవడం, పండితుడయి హైస్కూల్లో చేరడం, భిన్న ఆశ్రమ స్వీకారాల్లా కనపడతాయి. దేవులపల్లి తమ్మన్నశాస్త్రిగారు, ఆకుండి వ్యాసమూర్తి శాస్త్రిగారు, స్కూలుపండితులే అయినా, ఆ పదవులను

ఏలేరుగాని ఏలికలకింద పీలికల్లా బతకలేదు. వారిచేతుల్లో దిగ్గంతులు పుట్టి పెరిగారు. అది వేరే కథ- అలా ఉంచుదాం.

తొడుక్కున్న నిండుబొత్తాల కోటూ - ముళ్ళ కిరీటం లాంటి తల పాగా, మూడువేళ్ళ వెడల్పుతో పక్కల్ని మూసి మధ్య తెల్లగా వున్న మడత ఖండువా తీసేసి, తెలుగు పండితుడుగారు కవిగా రంగంమీదకు అవతరించారు.

కలకత్తా తెల్ల మల్లు పంచె సప్తపింజలు పోసి కట్టి, పైన ఒక సిల్కులాల్చీ తొడిగి, మెడకు రెండువైపులా జారేలా ఒకశాలువా ధరించి గీరునామంతో కవిగా ప్రత్యక్షమైన ఆయన్ను చూస్తే కడుపు నిండేలా వుంది. వయస్సు నలభైకి పైని.

నలుపు తెలుపు కలిపిన చిక్కని మీసాలు రెండువైపులా చక్కగా సర్దుకుని ఒక యుద్ధానికి సిద్ధమవుతున్న యోద్ధలా ఆసనం అలంక రించారు.

పృచ్ఛకులు రెండు బారులు తీరి చదరంగంలో రెండోవైపు బల గంలా తమ ప్రశ్నలు మనస్సులో నూరుకుంటూ కూర్చున్నారు.

అవధానిగారు ఒకసారి దగ్గి ఇరువైపులా కలయజూచి కొంచెం వెనక్కి వాలి దిండు నానుకుని అలవోకగా కూర్చున్నారు.

కుడిప్రక్క ఒక వెండి చెంబులో మంచినీళ్ళ గ్లాసూ, ఎడంప్రక్క కంఠదఘ్నంగా టీ పట్టించిన ఫ్లాస్కూ, అంగరక్షకుల్లా ఉన్నాయి.

వెనుక ఒక ఆత్మీయుడు వయస్సు మిగిలినా- శిష్యప్రాయుడై ఒదిగి కూర్చున్నవాడై వన్నెల విసనకర్ర అందుకుని ఇటూ అటూ కదుపు

తున్నాడు. నిజానికి కవిగారికి ఇంకా చెమట పట్టడంలేదు. ఈ పైని అవ ధానం ప్రారంభిస్తే పట్టవచ్చు. కాని ఇవతల ఈయనకు ముందు చెమట పోసి వీవన ఊపడం ప్రారంభించాడు.

సభ గంభీరంగా ఉంది. వాతావరణం అంతా బరువెక్కి బిగబట్టి నట్టుంది. హృద్యమైన సాహిత్య సభ, నవ్వు మొగాలతో ఛలోక్తులతో పువ్వులు జల్లినట్టు, సన్నని సుగంధం వ్యాపించినట్టు, సాయిలా పాయి లాగా ఉండవలసిందిపోయి, ఏదో దారుణకృత్యం జరగబోతూన్నట్టు బిగువు బిగువుగా ఉండడం ఆశ్చర్యం కలిగించింది.

అవధానాలు అప్పటికే వెనక పట్టాయి.

తిరుపతి వెంకటకవులూ, రామకృష్ణకవులూ, తమ అవధాన ప్రక్రి యతో అసివారు లేగి తమ జంటలో దురదృష్టవశాత్తు ఒకొక్కరిని కోల్పోయి ఆయుధ విసర్జన ఇంచుమించుగా చేసిన రోజులు. వారి శిష్యులు కూడా అడపాదడపా ఎక్కడో ఒకటి అరా చెయ్యడమేగాని దాన్ని ఒక సాహిత్య సంక్రీడగా నిలపలేక పోయారు.

ఒకపక్క జాతీయోద్యమంతోపాటు భావకవిత్వం కూడా పుంజుకుని ముందుకు తోసుకు వస్తూ అవధానాల మీద మోజులేకుండా చేసింది. అంతకు ముందు పేరుకు ముందు అష్టావధాని అనో శతావధాని అనో తగిలించు కోడం ఫాషన్‌గా ఉండేది. కవిత్వమంటే ఏమిటో తెలిసి రసబంధురమైన కవిత పలికించ గలిగిన వారిని కూడా ఈ వ్యామోహం కొన్నాళ్ళదాక వదలలేదు.

భావకవుల్లో ఎన్నికగన్న రాయప్రోలువారూ, వేదులవారు కూడా ఆశుకవిత్వానికి అవధాన ప్రక్రియకూ కొన్నాళ్ళులోగి వాటి పైపై పూత

మెరుంగులనూ, లోలోపలి గుల్లతనానికి విసిగి అచ్చపు కవులై ఆనాటి సాహిత్య రసికుల్ని మంచి కవిత్వంవైపు తిప్పారు.

మోజుగా శతావధాని అని పేరుముందు రాసుకునే వేదుల సత్యనారాయణశాస్త్రిగారు ఆ బిరుదానికి విడాకులిచ్చారు. రాయప్రోలు సుబ్బారావుగారు మేనమామ అవ్వారివారితో తిరిగి ఆశుకవిత చెప్పి చెప్పి "జననీ ఏమిటి కింక ఆశుకవితా సన్న్యాస మిప్పింపవే" అని దానికి తిలోదకాలిచ్చారు. తర్వాత కలకండ అచ్చులం బోసిన రీతి కవితచెప్పి గణనకెక్కారు. వద్దాది సుబ్బారాయుడుగారు పూర్వకవితా సంప్రదాయానికి చెందిన వారైనా ఆనాడే ఆశుకవితా 'వ్యాపారానికి' విముఖులై "ఆశుకవి తోగ్ర వ్యాఘ్ర దంష్ట్రాళికే నబ్బబ్బా కవితాలతాంగి నెఱ సేయం జాల" అని తీవ్రంగా నిరసించారు. అంతేకాదు; ఆనాడు ఆంధ్రసాహిత్యంలోని ఆడంబరాన్ని, డాంబికాన్ని తెగ నాడిన వీరేశలింగంగారి సరస్వతీ నారద విలాపం కూడా ప్రజల్ని కొత్త చూపుకు మరల్చింది.

కనుక నేను విజయనగరంలో చదువుకుంటూన్నప్పుడుగాని, తర్వాత రాజమండ్రిలో ఉంటున్నప్పుడుగాని అవధానాలు ఒక కళాక్రీడగా జరగనూ లేదు. నే నందులో మోజుగా పాల్గొనూ లేదు.

అప్పటికే విశ్వనాథ, కృష్ణశాస్త్రి, శివశంకరులు యువజనాన్ని ఆకర్షించడం ప్రారంభించారు.

కవిత మనస్సు కదిలించాలి. అట్లా చేయనిది వట్టి మాటలపోగు; కవితా వంచన; అనే భావం దృఢ పడింది. రాస్తే రస ప్రధానంగా శిల్ప మహితంగా రాయాలి. లేకపోతే మానెయ్యాలి అనే కసి యువ మనస్సులలో రగులుతోంది. కనుక అవధాన ప్రక్రియకు బుద్ధి ఎదురు తిరుగుతోంది.

అవధాన మన్నది చూడడం అదే ప్రథమం నాకు. నా వయస్సప్పుడు 27. కనక కుర్రకారులోనే జమ. విశేషించి అప్పటికే కోరుకోకుండా వచ్చిన భావకవి అనే, అపఖ్యాతి, వెంట ఉంది.

కనుక నేను వారికి 'నిషిద్ధాక్షరి' ని.

కాబట్టి-మనస్సులో ఏ చింతాలేక ఖులాసాగా కూర్చున్నాను. సభ్యులంతా మిడుతూ మిడుతూ చూస్తూండడమేగాని అక్కడ అక్షరాలా ఏం జరుగుతుందో వారికి తెలియదు.

"అష్టావధాన కష్టావలంబన మన్న
నంబికొండయ దండనమ్ము మాకు"

అన్నారు ఒకప్పుడు తిరుపతి వేంకటకవులు. అందరికీ నేనులోకువ; నాకు నంబికొండయ్య లోకువ; అనే సామెతను అష్టావధానంమీద ప్రయోగించారు వారు. వారైతే అంత తేలిక అన్నారుగాని అది కష్టావలంబన మన్నమాట మరచిపోకూడదు. అష్టావక్ర మహామునిలా దానికి అష్టాంగాలుంటాయిట! అప్పుడే తెలిసింది. అవి ఇవి.

(1) సమస్య, (2) దత్తపది, (3) వ్యస్తాక్షరి, (4) నిషిద్ధాక్షరి, (5) అప్రస్తుత ప్రసంగం, (6) వర్ణన, (7) గంటల లెక్క, (8) పురాణం చెప్పడం.

నిజంగా కొంచెమైనా కవితా వాసన వున్నవి మూడే మూడు : సమస్య, వర్ణన, దత్తపది. ఇందులోను నిక్కచ్చిగా చూస్తే వర్ణన ఒక్కటే కవిత—ఎంత తొందరలో చెప్పినా కవి తాలూకు భావనా బలం కనపడేది

ఈ ఒక్కదానిలోనే. తక్కినవన్నీ ఆయన బుద్ధిబలంమీదా, ధారణా శక్తి మీద, గడుసుదనంమీద జరిపే దాడి మాత్రమే.

నిషిద్ధాక్షరి మరీ దారుణం. అడుగడుగునా ముళ్ళకంచెలు కొట్టి ఏదీ నడువు, ఎలా నడుస్తావో చూస్తాం! అనడంలాంటిది. అష్టావధాన హింసకు పరమావధి—

అసలిది వేదపండితుల జ్ఞాపకశక్తిమీద పరీక్షగా ప్రారంభమైనదట. అవధాని అంటే వేదపండితుడే ముందు స్ఫురించడం పరిపాటి—అవధానం అంటే శ్రద్ధ. ఆ ఏకాగ్రత వేద పఠనంలో మరీ నిశితంగా వుంటుంది. చదివినదంతా ఎక్కడబడితే అక్కడ వచోవిధేయంగా వుండాలి. తడుముకోకూడదు. అందించేవారుండరు. "ఫలానా అనువాకంలో ఫలానా మంత్రం చెప్పు" అంటే ఉత్తర క్షణంలో అందుకోవాలి. దిక్కులు చూడకూడదు. స్వరంలోనూ ఈ పరీక్ష వుంటుందట!

ఫలానా మంత్రంలో ఫలానా అక్షరం ఉదాత్తమా? అనుదాత్తమా? అంటే చటున చెప్పాలి. అప్పుడే అవధాని సార్థక నామధేయుడు. లేక పోతే ఔపచారికమే. వేదపరంగా ఈ పరీక్షకు పరమ ప్రయోజనం వుంది. అంత ఘట్టిగా అది వల్లె వేస్తేగాని నిలబడదు. ముఖతః నేర్చుకోవలసిందే గాని వ్రాసుకుని వల్లించడానికి వీలులేదు. భావగ్రహణంవల్ల, రసాస్వాదనం వల్ల, మాటలు జ్ఞాపకం పెట్టుకునే వీలులేదు. పట్టి నిష్కామకర్మ. పెద్ద రాబడీ వుండదు. కాని వేదపండితుడనే మాట పరమ గౌరవంగా భావిస్తారు.

కనుక— ఈ పరీక్ష అవధాని ధారణాపటుత్వం తెలుసుకొనడానికి ఒక సాధనం. అయితే—

కవిత్వాని కెందుకూ, ఇది?

బదరీబాదరాయణ సంబంధంలా కవిత్వవాసన వున్న మూడు అంశాలతోలేని అయిదు అంశాలను కలిపి ఈ సాహిత్యక్రీడ ఏమిటో చమత్కారంగా ప్రారంభమయింది.

ఒకనాడు అదే కవిత్వ మనేటంత భ్రమకూడా—కల్పించింది.

ఇంతకూ—హైస్కూలు సెంట్రల్ హాల్లో అష్టావధానం ప్రారంభమయింది.

సభలో కూర్చున్న క్లాసు పిల్లలు పక్కవాళ్ళను ఏదైనా అడగబోతే—సభాశాంతిని పరిరక్షించే అవధానిగారి ఆత్మీయుడు నోరు నొక్కుకున్నాడు.

కవిగారు ఒకసారి కళ్ళు మూసుకుని ఝామ్మని ఒక పద్యం అందుకున్నారు. దానివెంట మరి ఒకటీ—వెంటవెంటనే ఒకటొకటిగా అరడజను పద్యాలు ఆశువు అన్నట్టుగా మధ్య మధ్య ఆగుతూ అందుకుంటూ సభ నిశ్శబ్దమై పీసు లప్పగించి వినేలా ఊతంగా చదివారు. అందులో గణపతి సరస్వతీ ప్రార్థనలూ, వచ్చిన సభాస్తారుల్లో పలుకుబడిగలవారి ప్రశంసలూ, అక్షరాస్యుల అనునయాలూ శ్రావ్యంగా వినిపించాయి.

ఎవరో సన్నాయి నొక్కులా—వల్లించిన పద్యా లంత ధారాళంగా వున్నాయండీ—అన్నా—

ఆయనకు వినపడలేదు.

సమస్యతో ప్రారంభమయింది—

"కోటింటని పండితుండు కుశలుండయ్యెన్"—చాలామంది నోళ్ళల్లో నలిగిపోయిన ఆ సమస్య కవిగారు "పకోడి"గా నమిలి పారేశారు.

సభ చప్పట్లుకొట్టింది. ప్రతి సభలోనూ అందుకోసం కొంద రుప్పట్లుగా—అక్కడా వున్నారు.

నగలు, పగలు, వగలు, సెగలు అనే దత్తపది ఇచ్చి రామాయణ భావార్థాల్లో చెప్పమన్నారు.

కవిగారు సుగ్రీవుడు రామునకు చూపిన నగల మూటతో ప్రారంభించి రామాయణం, కౌరవ పాండవుల పగలతో భారతం పూర్తిచేసి— సక్కాసులో ఫీటుచేసి రెండు చేతులూ సొగసుగా తిప్పినట్టు మొహంపెట్టి దయ్యాలంగా ఫ్లాస్కువైపు చూచారు. భృత్యప్రాయుడు ఖంగారుగా మూత తీసి కప్పులోపోసి, కొంత ఒలకబోసి అందించాడు. కవిగారు కొంత పీల్చి బిలాసాగా పక్కనపెట్టి వర్ణన కందుకున్నారు. ఘోటక బ్రహ్మచారి పెండ్లి వాంఛను సీసంలో వర్ణించమన్నారు.

కవిగారి వెండిమీసాల్లో బంగారంలాంటి నవ్వుతో సీసం వెలువడ బోతున్నది.

ఈ సందులో ఒకటి రెండు గంటలు—మధ్య మధ్య మూడు వ్యస్తాక్షరి కాగితం ముక్కలు.

కవిగారు మరచెంబువైపు చూచారు. జలకుంభకర్ణుడు చటున గ్లాసుతో అందిచ్చాడు. పుచ్చుకున్నట్టు పెదవివద్ద ఉంచి తీసివేశారు. అవధానిగారికి చెమటలు పోశాయి. అంతవరకూ శ్రద్ధగా ఆడే వెన్నెల వినన

కర్ర నిద్రపోయింది. కవిగారు పద్యపాదం చివర రాగం తీసినట్టు ఉరి మారు పీపన మేలుకుని తెగడూగడం ప్రారంభించింది. కవిగారు నవ్వుతో కలిపి గట్టిగా మూలిగారు. విసనకర్రకు స్థాయిభావం ఏర్పడింది.

కవిగారి ఆప్తులు, ఆయన సౌకుమార్యానికి విస్మితులై వీరు అలసి పోవడం ప్రారంభించారు. అవధాన చాతుర్యానికి, అపురూప ప్రదర్శనకు, ఆవలించిన నోళ్ళు మూయడం మరచిపోయారు.

అవధానం రసకందాయంలో పడింది.

కవిగారి మెడలో సభా ప్రారంభంలో సభా నిర్వాహకులు వేసిన పెద్ద మల్లెదండ - ఆయన తీసిపెట్టినచోట నన్నే చూడమన్నట్టుంది.

కవిగారి దృష్టి దానిమీద పడింది.

నిషిద్ధాక్షరి కవిగారిమీద పడింది.

సభాశోభమీద కందపద్యం -

కవిగారి-అసలే ఎర్రని ముఖం-మరింత ఎర్రబడింది. రెండుసార్లు మీసం రెండువైపులా శ్రద్ధగా సవరించారు, కందపద్యంలో రెండు పాదాలు సవరించినట్టు. చల్లని మల్లెపూలను ఒకసారి ముఖానికి అద్దుకుని ఆఘ్రాణించారు. కాస్సేపు కళ్ళమీద వుంచారు.

శిరసా-వహించదలచికూడా మొహమాటపడి ఊరుకున్నారు.

సభలో గుసగుసః-

"అష్టావధానమంటే మాటలా? మెదడులో మంటలు మంటలు!"

"ఇంతమంది తెలుగు పండితులున్నారు! ఏదీ ఒక్కడ్ని చెయ్య మనండి, చూద్దాం. వెయి కదపా ఇస్తాను."

ఒక కొంటెవాడు సన్నంగా—"బాబూ, మీరు కదపా ఇచ్చినా—మేం ఏటిస్టారి ఖర్చులు భరించలేం" అన్నాడు నవ్వుతూ—

ఇంకొకడు—"అం చెయ్యాలి భోజనం; చేతకానివాళ్ళంతా భావకవుల ముని వేషాలు వేస్తారు. వేషాలు—"

"కవిత్వమంటే— ఇంటబుట్టిన విద్యయ్యా—
అంటించుకుందామంటే రాదు"

"అది మనవాడి సొమ్ము" అన్నాడు ఇంకో స్వకులాభిమాని.

కెమెరా కవిగారి మీదకు తిరిగింది.

నిషిద్ధాక్షరీయుడు కత్తినూరుకుని

సిద్ధంగా ఉన్నాడు.

కవిగారు శ్రీ అని ఎత్తుకున్నారు.

నిషిద్ధుడు 'క' నిషిద్ధం అన్నాడు.

'ర' అన్నారు, కవిగారు.

'మ' నిషిద్ధం అన్నాడు, పృచ్ఛకుడు, నిర్దయగా—

'హ' అని ముందుకు చూచారు, కవిగారు—

పచ్చజెండా ఊపాడు, నిషిద్ధుడు.

'శ్రీ హావణిల్లి' అంటూ నిషేధాలు తోసుకుంటూ పద్యం నడచి పోయింది.

అప్రస్తుత ప్రశంస, పురాణం, యథాతథంగా నడిచిపోయాయి.

అవధానిగారి సిల్కుచొక్కా అంతా తడిసిపోయింది.

'అబ్బా, ఏం ఉక్క !' అన్నారు, పార్శ్వదులూ, పారిషదులూ. అవధానం 'విజయవంతం'గా ముగిసింది.

చప్పట్లవర్షం కురిసింది.

సభ చివర ఒకడు ఉండబట్టలేక జనాంతికంగానే పక్కవాడితో "గంటలు 15 కొడితే 13 అనే అన్నారేమిటి! కవిగారు !" అనగానే ఇంకొకడు గుడ్లురిమి చూస్తూ- "ఊరుకో, నువ్వు విన్నావు మహా-"అంటే ఇవతలాయన నవ్వుతూ- "గంటలు కొట్టింది, నేనేనయ్యా" అన్నాడు.

మొదటివాడు కిక్కురుమనకుండా జనంలో మునిగిపోయాడు.

ఒక భద్రాజు సంతోషం పట్టలేక కవిగారి రెండు పాదాలు ముట్టుకుని "ఏమి అవధానం! ఏం విధానం! ఆ మధ్య రెండేళ్ళ క్రిందట పుంజులూరులో మీ అవధానం చూశాను. ఏమి ధార, ఏమిరసం! అవే పద్యాలు, అదే వర్ణన, అదే సమస్య" అని ఇంకా చెప్పబోతూండగా- కవిగారు- వినయసూచకంగా వినిపించుకోకుండా అనుయాయులతో-చరచరా ముందుకు నడచి వెళ్ళిపోయారు.